# స్త్రీ సాహసం

సెకండ్ షో సినిమా వదిలారు. థియేటర్ కొంచెం దగ్గరే కాబట్టి నడుస్తూ ఇంటికి వచ్చాను. మా ఇంటి వరుసలో ఇంకా కొన్ని ఇళ్లు వున్నాయి. ఆ ఇళ్లలో వుండే వాళ్లంతా ఆ ఇళ్లముందు వున్న విశాలమైన ఖాళీ మైదానంలో మంచాలు వేసుకుని పడుకుని నిద్రపోతున్నారు.

గుడ్డి వెన్నెలలా వుంది. నేను కూడా సినిమాకు వెళ్లేముందు నేను పడుకునే ఫోల్డింగ్ వైరు మంచాన్ని, పక్క బట్టలను మైదానంలో ఓ చివరగా వుంచుకుని వెళ్లాను. రాగానే మంచం వాల్చుకుని పడుకోవచ్చునని.

వాల్చి వున్న మంచాల మధ్యనించి నా మంచం దగ్గరకు చిన్నగా నడుస్తున్నాను, పడుకున్న మనుషులను చూసుకుంటూ. పెద్దవాళ్లూ, చిన్నవాళ్లూ, పిల్లలూ గాఢనిద్రలో వున్నారు.

ఒక మంచం మీద వెల్లకిలా పడుకుని విజయ కనపడింది. విజయ కనపడటంతోనే అప్రయత్నంగా నా కళ్లు కదలటం ఆగిపోయాయి. విజయ మంచం దగ్గర నిలబడిపోయాను.

వెల్లకిలా పడుకున్న విజయ గుండెలమీద పమిట తొలగిపోయి వుంది. గొంతు కింద శరీరంలో నున్నగా మెరుస్తోంది. నాలో వున్న కోరికను గ్రహించి ఆమె నన్ను ఆహ్వానిస్తున్నట్టుగా ఉంది.

విజయ మా కాలేజీలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. నేను ఫైనలియర్ చదువుతున్నాను. అందంగా, పుష్టిగా, బలంగా వుండే విజయ మీద నాకు ఎప్పటినించో మనసు వుంది.

సినిమా నుంచి తిరిగి వస్తున్నప్పుడే విజయ గురించిన ఆలోచన నా మనసులో ఉంది. విజయ ఒంటరిగానే పడుకుంటుంది. కాబట్టి వెళ్లి ఆమె పక్కనే పడుకుందామనుకున్నాను. కోరిక మనిషికి ఎలాంటి బలాన్నయినా, ధైర్యాన్నయినా ఇస్తుంది.

మంచం పక్కనే నిలుచుని ఆమెను అలా చూస్తున్నప్పుడు నాలో ఆత్రుత పెరిగింది. మొనదేలిన గడ్డం, పలుచని పెదవులు, నుదిటి మీద పడి గాలికి నాట్యం చేస్తున్నట్టున్న మెలికలు తిరిగిన శిరోజాలు చూస్తూ నన్ను కంట్రోలు చేసుకోలేకపోయాను.

విజయ నాతో బాగానే మాట్లాడుతోంది. కనిపించినప్పుడల్లా నవ్వుతూ పలకరిస్తుంది. అదంతా చూసి ఆమెకు నామీద ఇష్టం వుందని అనుకున్నాను. వయసులో వుంది కాబట్టి నా కోరికను తిరస్కరించదనే నమ్మకం ఒకటి వుంది.

ఇంతేకాకుండా ఒకసారి విజయ నా దగ్గర వున్న ఒక మసాలా డిటెక్టివ్ నవలను అడిగి తీసుకుంది. దాన్ని చదివి తిరిగి నాకు ఇస్తూ ఆ నవల చాలా బావుందని చెప్పింది. అందువల్ల సెక్స్ పట్ల ఆమెకు ఇంట్రస్టు వుందని అనుకున్నాను. అప్పటినించే ఆమె కోసం ప్రయత్నం చెయ్యాలనిపించింది.

కాలం గడుస్తోంది. మెల్లగా విజయ పక్కనే మంచం మీద పడుకోవాలనుకున్నాను. కానీ మళ్లీ ఆలోచించాను. అంతా నేను అనుకున్నట్టు జరిగితే ఫర్వాలేదు. విజయ అరిచి గొడవ చేస్తే? అప్పుడు నా పరిస్థితి ఏమిటీ?

ఇలా ఆలోచిస్తూ నిల్చున్నాను. చివరకు నాలో వున్న కోరిక జయించింది. వయసు తొందర చేసింది.

విజయ మీదకు వొంగాను.

సరిగ్గా అప్పుడే ఎవరో నిద్ర లేచినట్టున్నారు.

"ఎవరు?" పెద్దగా అడిగారు. ఎవరో తెలీదు. కొంచెం దగ్గరినించే వినిపించింది ఆ స్వరం.

నేను మాట్లాడలేదు. నిటారుగా నిల్చున్నాను.

"ఎవరా మనిషి? ఎవరని అడుగుతుంటే మాట్లాడరేం?" గద్దించినట్టుగా వుంది. ఆడగొంతు.

ఇంకోసారి అడిగిన తర్వాత కొంచెం కదలి "నేనే" అన్నాను.

"నేనంటే ఎవరు? పేరు చెప్పు" మళ్లీ అన్నది. ఈసారి ఆమె గొంతును గుర్తు పట్టాను. మాపక్క ఇంట్లో వుండే శకుంతలమ్మ. యాభై యేళ్లుంటాయి.

చంద్రుడిని మేఘాలు కమ్మినట్లున్నాయి. కొంచెం చీకటయ్యింది.

"పరమశివాన్ని" నసుగుతున్నట్టుగా అన్నాను.

ఆమె అరుపులకు ఇంకొంతమంది నిద్ర లేచినట్టున్నారు. "ఏమిటి? ఎవరు? ఏం జరిగింది?" అని అడుగుతున్నారు. ఆమె నన్ను చూపించింది.

అంతా లేచి నా దగ్గరకు వచ్చారు.

శకుంతలమ్మ నా దగ్గరకు వచ్చి "విజయ మంచం దగ్గర నీకేం పని? నువ్వేం చేస్తున్నావ్?" అని నిలదీసింది.

వెంటనే ఏం చెప్పాలో తోచలేదు.

ఇలా జరుగుతుందని ముందే వూహించినట్లయితే ఏదో ఒక జవాబు ఆలోచించి

పెట్టుకునేవాడిని-కానీ ఇప్పుడేమిటి దారి?

"చెప్పవేం? ఇక్కడ నీకేం పని?" అంది.

"పడుకున్నవాడివి లేచి విజయ మంచం దగ్గరకు ఎందుకు వచ్చావ్?" ఒక మగాయన అడిగాడు.

ఈ అరుపులకు విజయ నిద్రలేచి తన మంచం దగ్గర మనుషులను చూసి ఏం జరిగిందో అర్థం అవక మంచం మీద సర్దుకుని కూర్చుంది.

"ఏమయ్యింది?" విజయ నన్నే అడిగింది.

"ఈ పరమశివం నీ మంచం దగ్గర నిలబడి నీ మీదకు తొంగి చూస్తున్నాడు!" శకుంతలమ్మ-విజయతో చెప్పింది.

"నిజమేనా శివం?" నన్ను అడిగింది విజయ నమ్మలేనట్టుగా.

"అవును. నిజమే" అన్నాను ధైర్యంగా.

"సెకండ్ షో సినిమా కెళ్ళొచ్చాను. దాహమవుతోంది. నీళ్లకోసం నిన్ను నిద్రలేపుదామని ఇక్కడ నిల్చున్నాను. ఇంతలో శకుంతలమ్మగారు లేచి అరిచింది" అన్నాను చాలా మామూలుగా.

"నీళ్ల కోసమా?" అన్నది విజయ.

"అవును విజయా..మీ ఇల్లు ఈ పక్కనే కదా..నువ్వు ఇంట్లోకి వెళ్లి నీళ్లు తెచ్చి ఇస్తావని నిన్ను లేపుదామనుకున్నాను.. అంతే" అన్నాను నమ్మకంగా.

"ఇంకెవరినైనా లేపవచ్చుగా" అన్నాడు మగాయన.

"అవును. కానీ పెద్దవాళ్లను నిద్రలేపితే విసుక్కుంటారు. విజయ నాతోపాటు మా కాలేజీలో చదువుతోంది కాబట్టి విసుక్కోకుండా నీళ్లు తెచ్చి ఇస్తుందని ఇక్కడకు వచ్చాను. మీరు అపార్థం చేసుకున్నారు. నేనెలాంటి వాడినో ఇక్కడ అందరికీ తెలుసు" అన్నాను. నాకు నేను ఒక మంచి సర్టిఫికెట్ ఇచ్చుకుని.

"అవును, పరమశివం అలాంటివాడు కాదు. ఇంతకు ముందు కొన్నిసార్లు నేను పరమశివానికి మంచినీళ్లు ఇచ్చాను. ఆగు. నీళ్లు తెచ్చిస్తాను" అని విజయ మంచం దిగి వెళ్లి ఇంటి తాళం తీసి పెద్ద స్టీలు చెంబుతో నీళ్లు తీసుకువచ్చింది.

నిజంగా బాగా దాహంతో వున్నవాడిలా ఆత్రంగా ఆ చెంబును అందుకుని నీళ్లన్నీ గబగబా తాగాను.

"ఇహ వెళ్లి పడుకో" అంది విజయ.

నేను నా మంచం దగ్గరకు వచ్చాను. అంతా వెళ్లి పడుకున్నారు.

మంచం మీద పడుకున్న నాకు ఒక విషయం అర్థం కాలేదు. విజయ ఎందుకు అలా చెప్పింది. ఇంతకుముందు ఎప్పుడూ కూడా ఇవ్వలేదు, కానీ అందరి ముందూ

తను నాకు ఇంతకుముందు కొన్నిసార్లు మంచినీళ్లు ఇచ్చానని చెప్పింది. ఎందుకు? ఎందుకలా చెప్పింది? ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

అదృష్టం కొద్దీ మా అమ్మా, నాన్న నాలుగు రోజుల క్రితం వూరికి వెళ్లి తిరిగి రాలేదు. కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే నా పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యేది.

ఎలాగో బయట పడ్డాను. ఇంకెప్పుడూ ఇలాంటి సాహసాన్ని చెయ్యకూడదనుకున్నాను. కానీ విజయ మీద మనసు చావలేదు. విజయ గుర్తుకు వచ్చినప్పుడల్లా మనసు, శరీరం బాధతో కొట్టుకుంటున్నాయి.

తెల్లవారాక విజయ మొహాన్ని ఎప్పుడు చూడగలనా? అనుకున్నాను. విజయ నిజంగా నన్ను నమ్మిందా? లేక ఇంకా ఎక్కువ గొడవ జరగటం ఇష్టంలేక అలా నటించిందా? సరిగ్గా తేల్చుకోలేకపోయాను.

రోజూలాగే తయారయి కాలేజీకి వెళ్లాను. క్లాసు రూమ్‌లోకి వెళుతూ విజయ కనపడింది. నన్ను చూడలేదనిపించింది.

సాయంత్రం కాలేజీ వదిలారు. ఒక్కడినే కాలేజీ నుంచి బయటకు వస్తున్నాను. విజయ ఆలస్యం చెయ్యకుండా ముందు వెళుతోంది.

గేటు దగ్గరకు వచ్చేసరికి విజయ నా కోసమే ఎదురుచూస్తున్నట్టు నిలబడి వుంది. నన్ను చూడగానే దగ్గరకు వచ్చి, ఒక మడత పెట్టిన తెల్ల కాయితాన్ని ఇచ్చి "చదువుకుని చించెయ్యి" అని చెప్పి వెళ్లిపోయింది.

ఆత్రంగా కాయితం మడత విప్పాను. అందులో ఇలా వుంది.

'నా మనసులోనూ అదే కోరిక వుంది. ఆడదాన్ని కాబట్టి నీలాగా సాహసం చెయ్యలేకపోయాను. రాత్రి వచ్చిన సమయానికే ఈ రాత్రి కూడా నా మంచం దగ్గరకు వచ్చి నన్ను తట్టి లేపు. మనిద్దరం మా ఇంట్లోకి వెడదాం' –విజయ.

*(సకుటుంబ సపరివార మాసపత్రిక స్వప్న–అక్టోబరు 2009)*